కథానిక — సి. ఆనందారామం



# మనిషికి ఏం కావాలి?

**నిజాయితీకి, ఆదర్శాలకు కట్టుబడి జీవిస్తున్న ఓ మహిళ తన ఆశలు నెరవేర్చుకోవడానికి ఇతరుల జీవితాలను బలిపెట్టడానికి సైతం దిగజారిపోయిన తీరును ఆనందారామం గొప్పగా చిత్రించారు.**

ఉదయం ఆరుగంటలు.

ప్రభ ఇంకా నిద్రపోతోంది. అమాయకంగా నిద్రలో ఉన్న ప్రభ ముఖం చూసిన తర్వాతగాని నాకు రోజు ప్రారంభం కాదు. 'ముందు ముందు ప్రభకి పెళ్ళై అత్తవారింటికి వెళ్ళిపోతే' అన్న ఆలోచన వచ్చినప్పుడల్లా లోలోపల వణకిపోతాను. నవనాడులూ కుంగినట్లవుతుంది. బలవంతాన ఆ ఆలోచనను అణిచేశాను. రాను రాను ఈ ప్రేమకి బానిసనయిపోతున్నానా అనే ఆలోచన భయపెట్టూ ఉంటుంది. ఏ మనిషీ అన్ని బంధాలూ తెంచుకొని బతకలేడేమో! తనకి తానుగా ఏదో ఒక బంధానికి బానిసైపోతూ, ఆ బానిసత్వంలోనే సంతృప్తి చెందుతాడేమో!


నేను లేచి కాఫీ డికాషన్ తీసి, కాలకృత్యాలు తీర్చుకొని పనిమనిషితో పనులు చేయించుకొంటూంటే ప్రభ లేచింది. దానికి కాఫీ ఇచ్చి, నా కాఫీ కప్పు తెచ్చుకొని దానెదురుగా కూర్చున్నాను.

"ఇవాళ టిఫిన్ ఏం చెయ్యమంటావ్?"

ప్రభ నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా "ఇంతవరకు కాఫీ తాగకుండా నువ్వేం చేస్తున్నావ్?" అంది ముద్దుగా కోప్పడుతున్నట్లు. అది నన్ను గురించి అలా పట్టించుకోవటం నాకెంతో ఇష్టం. లోలోపల ఆనందిస్తూనే నిరాసక్తంగా అన్నట్లు "ఏదోలెస్తూ! ఏం టిఫిన్ చెయ్యమంటావో చెప్పు" అన్నాను.

"ఏదో ఒకటి చెయ్యి. నా బుర్రలో తినబోయే టిఫిన్

చిత్రాలు : బాలి




గురించి ఆలోచించేటంత ఖాళీ లేదు."

"అలా కాదు. అన్నీ సిద్ధంగా ఉన్నాయి. ఏం కావాలో చెప్పు. అదే చేస్తాను."

"అబ్బబ్బ! నా నోటితో చెప్పిస్తేగాని వదలవు. సరే, పెసరట్టు వెయ్యి. ఇక తిండి గురించి నన్ను చంపకు. నేను చదువుకోవాలి."

స్టడీలోకి వెళ్ళింది ప్రభ. దాని స్నానానికి నీళ్ళు అమర్చాను. అది కాలేజీకి కట్టుకోవలసిన బట్టలు ఇస్త్రీ చేశాను. ఈ పనులన్నీ నన్ను చెయ్యమని ప్రభ అడగదు. ఇలా చేస్తున్నప్పుడు ఏదో చాకిరీ చేస్తున్నట్లు నేననుకోవడంలేదు. ప్రభ కోసం ఈ పనులన్నీ చెయ్యటంలో నాకెంతో ఆనందం ఉంది. ఉదయం లేచి ఈ పనులు చెయ్యాలనే రాత్రి పొద్దుబోయేవరకు మేల్కొని నా లెసన్స్ చూసుకుంటాను.

దాదాపు పదేళ్ళ కిందట రవికి, నాకు పడక విడిపోయాం. అప్పుడు ఏదో శూన్యం నా మనసునావరించుకుంది.

కానీ, నా స్వతంత్ర వ్యక్తిత్వం నిలుపుకోవటానికి భర్తనైనా వదులుకున్నానని గర్వపడ్డాను.

అప్పట్లో ప్రభ చిన్నది. ఆనాడు నా జీవితంలో ఇంత శూన్యం ఏర్పడుతుందని, నేను పూర్తిగా ప్రభ ప్రేమ మీదనే ఆధారపడి బతుకుతానని అనుకోలేదు.

రవి నుంచి విడాకులు తీసుకున్నందున ఎందరో నన్ను విమర్శించారు. "ఎలాగో సర్దుకోకపోయావా?" అని నీతులు కూడా చెప్పారు. సర్దుకోవటమనేది రెండువైపులా ఉన్నప్పుడే అది సర్దుకోవటమవుతుందిగాని, లేకపోతే బానిసత్వమవుతుంది. బానిసగా బతకటంకంటే ఒంటరిగా బతకటం మేలనుకొన్నాను. కానీ, ఒంటరితనం నేను భరించలేనని త్వరలోనే అర్థమయింది. ప్రభ చుట్టూ నా మనసంతా అల్లుకుపోతూ ఉంది. అల్లుణ్ణి ఇల్లరికం తెచ్చుకోవాలనే ఆలోచన చాలాసార్లు వచ్చింది. కానీ, బయటపెట్టలేదు. ప్రభ సహించదని నాకు తెలుసు.

స్నానం చేసి వచ్చిన గులాబీలా తయారైన ప్రభని కళ్ళనిండా చూసుకున్నాను. వేడి పెసరట్టు అల్లప్పచ్చడితో ప్లేట్లో వేసి అందించాను. ఏదో ఆలోచిస్తూ తినేసి "నువ్వేసిన దోసె చాలా బాగుందమ్మా, బోర్నవిటా ఇచ్చేయ్-వెళ్ళిపోవాలి" అంది.

ఉసూరుమనిపించింది. తిండి మీద మనసుపెట్టే వయసు కాదు ప్రభది. ఆ విషయం నాకు తెలుసు. కానీ, దానిమీద ఆప్యాయత చూపించటానికి ఇంతకంటే మరో

స్నానం చేసి వచ్చిన గులాబీలా తయారైన ప్రభని కళ్ళనిండా చూసుకున్నాను. వేడి పెసరట్టు అల్లప్పచ్చడితో ప్లేట్లో వేసి అందించాను. దానిమీద ఆప్యాయత చూపించటానికి ఇంత కంటే మరో మార్గం నాకెక్కడ దొరుకుతుంది?

మార్గం నాకెక్కడ దొరుకుతుంది? అది రెక్కలు విప్పుకొని గాలిలోకి ఎగరాలని చూస్తోంది. నేను దానికి గూట్లోని ఆకర్షణలు చూపటానికి ప్రయత్నిస్తున్నాను. నాది వ్యర్థప్రయత్నం కాదుగదా?

ఆరోజు లలిత విషయం పరిశీలించవలసి ఉంది. ఆ విషయం పరిశీలించే బాధ్యత నామీద వేసి వి.సి పక్కకి తప్పుకున్నారు. ఇప్పుడీ విషయంలో

ఏది ఎలా జరిగినా బాధ్యత నేనే వహించవలసి ఉంటుంది.


ప్రొఫెసర్ మహేందర్‌కి సంబంధించిన కథలు లోగడ కర్ణాకర్ణిగా విన్నాను. అతడు జె.ఆర్.ఎఫ్ విద్యార్థుల దగ్గర స్కాలర్‌షిప్ వచ్చినరోజు డబ్బులు అప్పుగా అడుగుతాట్ట! స్టూడెంట్ ఇవ్వనంటే స్కాలర్‌షిప్ ఫామ్ మీద సంతకం చెయ్యను - అంటాట్ట. నిజంగా ఇది చాలా ఘోరం. "ఆచార్య దేవోభవ" అని ఇలాంటి ఆచార్యులను ఎలా అనటం? ఆడపిల్లల విషయంలో కూడా శ్రుతిమించి ప్రవర్తిస్తాడని అన్నారు. పాపం! అతడి స్టూడెంట్స్‌లో ఎక్కువమంది ఎలాగో ఓలాగా డాక్టరేట్ డిగ్రీ తెచ్చుకొని బయటపడితేచాలని సహనంతో ఉంటారు. వివాహ వ్యవస్థలో మాత్రమేనా, మగవాడు స్త్రీని డామినేట్ చేస్తున్నది? స్త్రీ స్త్రీత్వం మగవాడికి అన్ని రంగాల్లోనూ విలాస వస్తువుగానే కనిపిస్తోంది.

లలితకి, ప్రొఫెసర్ మహేందర్‌కి మధ్య ఏం జరిగిందో ఏమోగాని, ప్రొఫెసర్ మహేందర్ తనపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, ఆయన మాట కాదంటే తన రిసెర్చ్ వర్క్ సాగనియ్యటం లేదని రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. దానిమీదే ఇప్పుడు గొడవ జరుగుతోంది.

ప్రొఫెసర్ మహేందర్ రాజకీయంగా చాలా పలుకుబడి గలవాడు. ఆ పలుకుబడివల్లనే యం.యస్సీలో 55 పర్సెంట్ రాకపోయినా లెక్చరర్ పదవి లోంచి నేరుగా ప్రొఫెసర్ కాగలిగాడు. ఆ విషయం ప్రశ్నించినవాడెవడూ లేకపోయాడు. రాచకొండ 'అల్పజీవి' నవలలో వర్ణించినట్లు ప్రతివాడి మనసులోనూ భయం. ఇంకా ఇంకా దూరంగా - దూరదూరంగా తప్పించుకొని 'సేఫ్టీ'లోకి, 'భద్రత'లోకి ఒదిగిపోవాలనే ప్రయత్నం. ఈ ప్రయత్నంలో అంతా ఎక్కడికక్కడ ముడుచుకుపోతారే తప్ప, నోరు విప్పరు.

లలిత అయినా ఎంతగా విసిగిపోయిన తర్వాత ఈ కంప్లైంట్ ఇచ్చిందో! నా బాధ్యత నేను ధైర్యంగా నిర్వర్తించగలనా?

కాలేజీకి వెళ్ళి నా రూమ్‌లో కూర్చున్నాను. మారుతి కారులో



**తేలిగ్గా ఊపిరి తీసుకున్నాను. అతడు చెప్పింది బాగానే ఉందనిపించింది. లేనిపోని గొడవలవల్ల లలితకి మాత్రం ఏం ప్రయోజనం? "అలాగే! లలితను పిలిపించి మాట్లాడతాను" అన్నాను.**

ప్రొఫెసర్ మహేందర్ వచ్చాడు. చిర్నవ్వుతో "సారీ! మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నానా?" అన్నాడు కూచోమనకుండానే కూర్చుంటూ. అతడి నవ్వు, అతడి మాట కూడా వెగటుగా తోచింది నాకు.

"మేడమ్! మీరు ఏవేవో పత్రికల్లో చాలా ఆర్టికల్స్ పబ్లిష్ చేశారు కదా! అవన్నీ కలిపి బుక్‌గా వెయ్యకూడదూ?" అన్నాడు.

నాలోంచి వెగటు ఎగిరిపోయింది.

"చాలా కాదు. అన్నీకలిసి ఐదు పేపర్స్ మాత్రమే పబ్లిష్ చేశాను."

"బ్రహ్మాండం. అవి చాలు. నాకు తెలిసిన పబ్లిషర్ ఒకడున్నాడు. మాట్లాడమంటారా?"

"ప్లీజ్! అవి బుక్ ఫామ్‌లో తేవాలని చాలా రోజులుగా అనుకుంటున్నాను."

"అలాంటి బుక్ వస్తే మీకు డాక్టరేట్ లేని కొరత తీరిపోతుంది."

"అదెలాగ?"

"మనవాళ్ళు పిహెచ్.డి గాని, దాంతో సమానమైన ముద్రిత గ్రంథం గాని ఉంటే చాలన్నారు. సెలక్షన్ కమిటీ మీ వ్యాస సంకలనం పిహెచ్.డి థీసిస్‌తో సమానమైందని నిర్ధారించాక కాదనటానికి ఎవరికి గుండెలు?"

సెలక్షన్ కమిటీ అలా అంటుందా!"

"మహారాజులా అంటుంది. సెలక్షన్ కమిటీదేముందండి. వి.సి ఎంత చెప్తే అంత."

"కానీ, ....."

"మీరిక సందేహించకండి. మీ వ్యాస సంకలనం పబ్లిష్ కావటం, మీరు నేరుగా లెక్చరర్ పోస్టు నుంచి ప్రొఫెసర్ పోస్టులోకి రావటం ఖాయం. ఆ మాత్రం నేను నిర్వహించగలనులెండి."

అతడు తలచుకొంటే అంతమాత్రం నిర్వహించగలడనే నమ్మకం నాకుంది.

"థాంక్యూ." అన్నాను అప్రయత్నంగా.

అ నవ్వులో విజయగర్వం కొద్దిగా ముందుకు తొంగి చూసినట్లనిపించింది. కొద్దిగా ముందుకు వంగి తగ్గుస్వరంతో ఇలా అన్నాడు.

"లలిత చాలా ఫూలిష్ గాళ్. ఏవో వెకిలి నవ్వులు నవ్వేసి ఎందుకూ పనికిరాని మేటర్‌పైన సంతకం పెట్టించుకోవాలని చూస్తుంది. వద్దంటే ఏడుస్తుంది. ఏం చెయ్యను చెప్పండి? మనం పిహెచ్.డి ఇచ్చేది వాళ్ళు రాసిన మేటర్‌కి గాని, వాళ్ళు నవ్వే వెకిలి నవ్వులకు కాదుగదా!"

"అవునవును." గొంతు పొడారిపోతుండగా అన్నాను. అతడు చెప్పదలచుకున్నదేమిటో అర్థమైపోయింది. అతడొకసారి గొంతు సకిలించాడు.

"లలితను పిలిపించి కంప్లైంట్ విత్‌డ్రా చేసుకోమని చెప్పండి. ఇలాంటి కంప్లైంట్స్‌వల్ల ఒరిగేదేముంటుంది? అందరం జరిగింది మర్చిపోదాం. ఆ అమ్మాయికి తొందరగా పిహెచ్.డి పూర్తయ్యేలాగ నేను చూస్తాను."

తేలిగ్గా ఊపిరి తీసుకున్నాను.

అతడు చెప్పింది బాగానే ఉందనిపించింది. లేనిపోని గొడవలవల్ల లలితకి మాత్రం ఏం ప్రయోజనం?

"అలాగే! లలితని పిలిపించి మాట్లాడతాను."

మహేందర్ లేచి నిలబడ్డాడు. "నేను పబ్లిషర్‌తో మాట్లాడుతాను."

అతడి చివరి మాటలతో నా మనసు చీదరగా అయింది. ఏదో కుత్సితపు 'డీల్'లోకి ప్రవేశించిన భావన కలిగింది. నేను తల వంచుకొని ఉండగానే మహేందర్ ఠీవిగా వెళ్ళిపోయాడు. అంత ఠీవి ఎలా వచ్చింది అతనిలోకి? బహుశా నాబోటివారి దౌర్బల్యం, దురాశ మిగిలినవారి పిరికితనం అతని ఠీవికి ఆధారాలు కావచ్చు!

లలితని పిలిపించి మాట్లాడాను. ఆ అమ్మాయిలో నాకు వెకిలి లక్షణాలేవీ కనబడలేదు. చాలా పొందికగా ఉంది.

"ఒక ఆడపిల్ల ఎంతగా క్షోభిస్తే ఇలాంటి కంప్లైంట్ ఇస్తుందో ఊహించ



లేరా మేడమ్!'' అంది.

"నిజమే అనుకో! కానీ, ఇలాంటి విషయాల్లో అల్లరి పడితే మనకే నష్టం. పట్టించుకోకుండా నీ పని నువ్వు చూసుకుపోతే మంచిది.''

"మేడమ్! మీరేనా ఇలా మాట్లాడుతున్నది!" విభ్రాంతితో అంది లలిత. 'మీరేనా!' అన్న ఆమె మాట నా మనసును గుచ్చింది. "స్వతంత్ర వ్యక్తిత్వం కోసం భర్తకే విడాకులిచ్చిన నువ్వే నన్ను పిహెచ్.డి కోసం సర్దుకోమని చెప్తున్నావా?'' అన్నట్లుగా ఉన్నాయి ఆమె చూపులు.

"నా మాట విను. నీ కంప్లైంట్ విత్‌డ్రా చేసుకో. అతడు నిన్నే విధంగానూ అల్లరిపెట్టకుండా నేను చూసుకొంటాను. నీ పిహెచ్.డి పూర్తిచేయించే పూచీ నాది.''

లలిత ఆలోచనలో పడింది.

"నాకతడిపై ఏమాత్రం నమ్మకం లేదు. మీ మాటమీది నమ్మకంతో ఒప్పుకొంటున్నాను. చూద్దాం! ఏం జరుగుతుందో?''

లలిత కంప్లైంట్ విత్‌డ్రా చేసుకొంటున్నట్లు రాసి ఇచ్చింది. పరమానందంతో ఆ కాయితాన్ని నేను ప్రొఫెసర్ మహేందర్‌కి ఇచ్చాను.

"థాంక్యూ! థాంక్యూ వెరీ మచ్! పబ్లిషర్‌తో మాట్లాడాను. ఈ వారంలో వచ్చి మిమ్మల్ని కలుస్తానన్నాడు.''

ఆ సమయంలో పబ్లిషర్ విషయం ఎత్తకుండా ఉంటే బాగుండు ననిపించింది.

వారం గడిచింది. ఏ పబ్లిషరూ నాదగ్గరికి రాలేదు. మహేందర్ లలితని మరింతగా వేధిస్తున్నట్లు తెలిసింది. స్టూడెంట్స్ యూనియనంతా కంప్లైంట్ విత్‌డ్రా చేసుకొన్నందుకు లలితనే నిందించింది.

ఆరోపణ వెనక్కి తీసుకొంటే రిసెర్చ్ పూర్తి చేయిస్తానని నమ్మబలికి

"మమ్మీ!
అయామ్ వెరీ సారీ!
నేను వెళ్ళి
పోతున్నాను...
లలిత విషయం
విన్నాక నాకు నీ
నీడ అంటేనే భయంగా ఉంది... బై.
ఎప్పుడైనా తీరిక దొరికితే వచ్చి చూస్తాను.''

తీరా ఆరోపణ వెనక్కి తీసుకొన్నాక ఇలా వెన్నుపోటు పొడుస్తాడని నేనూహించలేకపోయాను. పచ్చి గూండాలైనా తమ మాటమీద నిలబడ్తారే! అలాంటిది చదువుకున్న, సంస్కారవంతుడైన ఆచార్యుడు తన మాటకి ఏ మాత్రం విలువలేనట్లు కపటంతో ప్రవర్తిస్తాడా? ఆ అమ్మాయి ఆ రోజు ఆ కంప్లైంట్ విత్‌డ్రా చేసుకోకుండా ఉంటే అతడి పరువు ఏమయిఉండేది? భవిష్యత్తు ఏ గంగలో కలిసేది? తన పబ్బం గడుపుకొని ఎదుటివారిని నట్టేట్లో ముంచేటంత నీచుడా అతడు!

ఇప్పుడేమనుకుంటే లాభం? లలిత నా ఎదుటికి వచ్చి నన్ను నిలదీస్తే ఏం సమాధానం చెప్పుకోగలను? అని భయపడ్డాను.

కానీ, లలిత నా ముఖం కూడా చూడలేదు. తను రిసెర్చ్ మానుకొని యూనివర్శిటీ వదిలి వెళ్ళిపోయింది.

లలిత వెళ్ళిపోయాక ఆమె రాసిన ఉత్తరం అందించాడు అటెండర్. అందులో రెండే వాక్యాలున్నాయి.

మేడమ్!

"మీకూ నాలాంటి కూతురుంది. ఆమెకే ఇలాంటి మోసం జరిగితే మీరేం చేస్తారు?''

లలిత.


ఆ ఉత్తరం ధర్మదేవత సుదర్శనచక్రంలా నా మనసును ముక్కలు ముక్కలుగా తునిమింది. ప్రభని లలిత స్థానంలో ఊహించుకొని గజగజలాడాను.

యూనివర్శిటీలో ప్రొఫెసర్ పోస్టుకి అడ్వర్‌టైజ్‌మెంట్ వచ్చింది. నా పబ్లిషర్ అప్పటికీ రాలేదు. అయినా, అప్లై చేశాను. నాకు ఇంటర్వ్యూ పిలుపు కూడా రాలేదు.

దిగాలుగా ఇంటికి వచ్చాను. నేనొచ్చేసరికి ప్రభ సామాను సర్దుకొని ఎక్కడికో ప్రయాణానికి సిద్ధంగా ఉంది.

మాట్లాడలేకపోయాను. బెదిరిన లేడిలా దాన్ని చూస్తూ కూలబడ్డాను.

"మమ్మీ! అయామ్ వెరీ సారీ! నేను వెళ్ళిపోతున్నాను. చిన్న



ప్పట్నించీ 'ఆచార్య దేవోభవ' అని నేర్చుకొన్నాను.

నిన్నూ ప్రొఫెసర్ మహేందర్ గార్ని చూశాక ఇకముందెప్పుడూ ఏ ఆచార్యుడికీ నమస్కారం చెయ్యకూడదనిపించింది. ఏమోలే? ఆచార్యులంతా మీ ఇద్దరిలాగానే ఉంటారా? నువ్వు నాన్నకి విడాకులిచ్చినప్పుడు నలుగురూ ఎన్నెన్ని మాటలన్నా నేను మాత్రం నిన్ను తప్పుపట్టలేదు. నిజాయితీతో నువ్వు నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టావని గర్వపడ్డాను. కానీ, ఇప్పుడు లలిత విషయం విన్నాక, నాకు నీ నీడ అంటేనే భయంగా ఉంది.

నేను హాస్టల్‌లో చేరిపోతున్నాను. మా స్టూడెంట్స్ యూనియన్ నాకండగా ఉంటుంది. మీబోటి ఆచార్యుల తీర్పులకు తలవంచవలసిన అవసరం ఉండదు. బై. ఎప్పుడైనా తీరిక దొరికితే వచ్చి చూస్తాను.''

ఆటోలో సామానుపెట్టుకొని ప్రభ వెళ్ళిపోతోంది. ఆగమని అడిగే నైతిక స్థైర్యం లేకపోయింది. కనీసం కన్నీళ్ళు కార్చే బేలతనం కూడా ఆవిరయింది. ఎటూకాని మోడులా కూచుండిపోయాను.

ఆనాడు రవి ఇంట్లోంచి ప్రభ చెయ్యిపట్టుకొని నేను వచ్చేశాను. ఈనాడు నా ఇంట్లోంచి ప్రభ స్వతంత్రంగా వెళ్ళిపోతోంది.

నా కళ్ళముందు శూన్యం. నా చుట్టూ శూన్యం. నాలో శూన్యం. చటుక్కున అనిపించింది.

ఇప్పుడు ప్రొఫెసర్‌షిప్ వచ్చినా నేనేం చేసుకుంటానని? ■